క్లుప్తంగా

నేటి నుంచి జీలుగ విత్తనాల విక్రయం

నిర్మల్‌రూరల్: మండలంలోని రెండు పీఏ సీఎస్ సొసైటీల్లో బుధవారం నుంచి జీలుగ విత్తనాలను విక్రయిస్తున్నట్లు ఏవో వసంతరావు తెలిపారు. 30 కేజీల జీలుగ బస్తా ధర రూ.2790.. సబ్సిడీపై రైతులకు రూ.1,116 కే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొని తమ క్లస్టర్ పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలన్నారు. టోకెన్ తెచ్చి బస్తాలను తీసుకెళ్లాలని సూచించారు. మంజులాపూర్ సొసైటీలో 250 బస్తాలు, ముఠాపూర్ సొసైటీలో 200 బస్తాలు అందుబాటులో ఉన్నాయని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోషకాహారం తీసుకోవాలి


కోడిగుడ్లు ఇస్తున్న సీడీపీవో సరిత

కడెం: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సరిత అన్నారు. మంగళవారం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఎంపీడీవోకు ఫిర్యాదు

భైంసారూరల్: తన తండ్రి చనిపోయినా.. ఆయన పేరిట పెన్షన్ తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన నూనె రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డిని తన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. తన తండ్రి ముత్తన్న సెప్టెంబర్ 2022లోనే చనిపోయినా.. నవంబర్ 2022 వరకు పెన్షన్ తీసుకున్నట్లు రికార్డుల్లో నమోదైందని పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం 24 మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం భవిత విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ భూమన్న, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

వీడీసీ కార్యవర్గం

సారంగాపూర్: మండలంలోని ఆలూరులో వీడీసీ కార్యవర్గాన్ని మంగళవారం గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షుడిగా పతాని నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా గోనుగొప్పుల రవి, 21 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ గ్రామంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకొని గ్రామాభివృద్ధికి పాటుపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

ముగిసిన ఎల్లమ్మ పండుగ


ఆకట్టుకున్న బైండ్లోళ్ల ప్రదర్శన

ముధోల్: మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఎల్లమ్మ పండుగ ముగిసింది. చివరిరోజైన మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణం, సిద్ధులు తిరగడం, గావు పట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బైండ్లోళ్ల నృత్యాలు అలరించగా గౌడ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఎమ్మెల్యే రామారావు పటేల్ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నరసయ్యాగౌడ్, బీజేపీ నాయకులు రమేశ్, పోతన్న ఉన్నారు.

'కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి'

కుంటాల: రాష్ట్రంలో కులగణన చేసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించాలని ఓబీసీ సోషల్ మీడియా జాయింట్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆప్క గజేందర్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కుంటాల బీసీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కులగణనతో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతారని పేర్కొన్నా రు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

విజేతగా రైడర్స్ జట్టు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో శూరా ఆధ్వర్యంలో శూరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఈనెల 19,20తేదీల్లో నిర్వహించారు. ఫైనల్‌లో స్ప్రింటర్స్ జట్టుపై రైడర్స్ జట్టు గెలుపొందింది. విజేతకు రూ.5 వేలు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.రెండు వేల నగదు, ట్రోఫీలను జిమ్ యజమాని వినోద్ అందజేశారు. వారి వెంట పలువురు ఉన్నారు.

పంట మార్పిడితో దిగుబడి పెంచుదాం


నిర్మల్‌రూరల్ మండలం ఎల్లపల్లిలో దున్నుతున్న రైతు, చిత్రంలో ఏవో నాగరాజు

నిర్మల్‌చైన్‌గేట్: పంట మార్పిడి చేసుకుంటే రైతులు అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఏళ్లుగా ఒకే పంటను సాగు చేస్తే భూమి నిస్సారంగా మారి చీడపీడల వ్యాప్తి పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి నాగరాజు పేర్కొన్నారు. త్వరలో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. ఈసందర్భంగా ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

పంటల మార్పిడితో ప్రయోజనాలు..

- భూమిలో నీరు నిలిచే శక్తి పెరిగి భూసారం వృద్ధి చెందుతుంది.
- చీడపీడలు, తెగుళ్ల వ్యాప్తి తగ్గి, నేల భౌతికస్థితి మెరుగుపడుతుంది.
- తక్కువ పురుగు మందుల వినియోగం
- బీజాలు, వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి ఉంటుంది.
- కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా ఉంటాయి.
- పంట దిగుబడిలో నాణ్యత పెరిగి మద్దతు ధర పొందే వీలుంటుంది.

రైతులు పాటించాల్సినవి..

- భూమిలో తేమను నిల్వ చేసే శక్తి ఉంటే ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.
- తేలికపాటి నేలలు, ఎర్ర, ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు సాగు చేసుకోవాలి.
- వర్షాలు ఎక్కువ కురిసే ప్రాంతాల్లో కంది, నువ్వులు, వేరుశనగ సాగు చేసుకోవాలి.
- పంట మార్పిడి చేసే ఏడాదిలో బంకమన్ను శాతం ఎక్కువ ఉండే ఎర్ర, నల్లరేగడి నేలలు, పల్లపు ప్రాంతాల్లో రెండు పంటలు పండించాలి.

ఏ పంట తర్వాత ఏ పంట వేయాలంటే..

- యాసంగిలో వేరుశనగ సాగు తర్వాత వానాకాలంలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు కొంత నత్రజని లభిస్తుంది. దీంతో రసాయన ఎరువుల వినియోగం తగ్గించవచ్చు.
- కంది, శనగ పంటలను వరుసగా వేస్తే కాయ తొలుచు పురుగుల తాకిడి అధికంగా ఉంటుంది. అందుకే ఈ పురుగులు తక్కువ ఆశించే

పంట మార్పిడిలో పాటించాల్సిన మెలకువలు

- పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటల్ని ఎంపిక చేసుకోవాలి. శనగ, బబ్బెర, పెసర, మినుము పంటలు నేలను కప్పి ఉంచుతాయి. దీంతో కలుపు మొక్కలను నివారించవచ్చు.
- వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ, చెరకు వేయడం వలన సుడిదోమ, తుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు.
- పత్తి సాగు చేసిన నేలలో మినుము, పెసర సాగు చేస్తే తెల్లదోమ ఉధృతి తగ్గుతుంది.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, సజ్జ, పొద్దు తిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలి. దీంతో వేరుశనగ పంటను ఆశించే ఆకుముడత ఉధృతిని తగ్గించవచ్చు.
- పసుపు తర్వాత వరి, జొన్న పంటలను సాగు చేసుకోవాలి.
- నులిపురుగుల సమస్య ఉన్న ప్రదేశంలో వేరుశనగ, మిరప, పొగాకు, వంకాయ పంటల సాగును కొంతకాలం మానుకోవాలి

జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలువ, మెట్ట వరితో పంట మార్పిడి చేసుకోవాలి. వరితో పంట మార్పిడి చేసుకుంటే వేరుశనగ కు నులిపురుగుల బెడద తగ్గుతుంది. పొద్దుతిరుగుడు అనంతరం కొర్ర, జొన్న, సజ్జ వంటి చిరుధాన్యాలను లేదా కంది, శనగ, మినుము వంటి అపరాల పంటలను లేదా వేరుశనగతో మార్పిడి చేసుకోవచ్చు. వంకాయ తోట తర్వాత కాలీఫ్లవర్ పంట మార్పిడి చేసుకుంటే మళ్లీ వంకాయకు ఎండు తెగులు సోకదు. టమాట, ఆవాలు, బంతి ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేస్తే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది.

ఇలా చేయొద్దు..

రైతులు.. వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటల మార్పిడి చేయాలి. పంట మార్పిడికి అనుకూలమైన పంటలను ఎంచుకోకుంటే చీడపీడల ఉధృతి ఎక్కువ అవుతుంది. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదు. ఎందుకంటే ఈ రెండు పంటలను ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయి. జొన్న వేసిన చేన్లలో మిరప వేయకూడదు. పసుపు తర్వాత మిరప, టమాటా, క్యాబేజీ, దోస, గుమ్మడి, సోర, బీర, పత్తి, ఆవాలు, బెండ వేసుకోకూడదు. ఆకుముడత ఆశించే ప్రాంతాల్లో వేరుశనగ, సోయా చిక్కుడు వేయకూడదు.

ధాన్యపు పంటలతో..

దోస, కాకర, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ వంటి తీగ జాతి కూరగాయలను వరి పైరుతో పంట మార్పిడి చేసుకోవాలి. ఉల్లిసాగు చేసే రైతులు ధాన్యపు పంటలతో మార్పిడి చేసుకోవాలి. పసుపు సాగు చేసిన వారు రెండేళ్లపాటు ఆ భూ మిలో పసుపు సాగు చేయకూడదు. వరి, చెరుకు, అరటి, తమలపాకు, పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది. మిరప, వే రుశనగ, క్యాబేజీ పంటలను ఆశించే లద్దె పురుగుల తాకిడి అరికట్టాలంటే జొన్న, సజ్జ, రాగి, వంటి ఆరు తడి పంటలతో మార్పిడి చేయాలి.

జాగ్రత్తలు తప్పనిసరి..

పోషకాలను ఎక్కువగా గ్రహించే నువ్వులు, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న పంటలకు బదులుగా భూమికి సమకూర్చే అపరాల పంటలతో పంట మార్పిడి చేసుకుంటే ఫలితం ఉంటుంది. అపరాల పంటలు కరువు పరిస్థితులను తట్టుకుంటాయి. అపరాల పంటల మీద ఉండే బుడిపెలు వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. సూక్ష్మజీవుల చర్యతో ఎంజైముల ఉత్పత్తి పెరుగుతుంది. నల్లరేగడి నేలల్లో సోయ చిక్కుడు వేసుకుంటే పంట కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. తద్వారా ఎకరాకు ఒకటి నుంచి రెండు టన్నుల సేంద్రీయ పదార్థం లభిస్తుంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సారంగాపూర్: ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై చంద్రమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని మలక్‌చించోలిలో ప్రజలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు వాహన ధ్రువపత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాలు పెరుగుతున్నందున స్మార్ట్‌ఫోన్లలో అపరిచితుల నుంచి వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఓటీపీ, ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు చెప్పి మోసపోవద్దని వివరించారు. త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


హోమంలో పాల్గొన్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని నగర్ గ్రామంలోని లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి 21ఎండీఎల్80 హోమం నిర్వహిస్తున్న భక్తులు వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మంగళవారం వేద పండితులు సంతోష్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోహం చేసి.. కల్యాణ వేడుకలను జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం


ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: దేశానికి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నందేడపు చిన్ను, అల్లూరి మల్లారెడ్డి, మెయిన్, పత్తి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేశ్, షౌకత్‌పాషా, గంగనర్సయ్య, సత్యనారాయణ, సురేశ్, శంకర్, గంగాధర్, అశోక్, మీర్జాబేగ్, జహీర్, శేషాద్రి, రమేశ్ ఉన్నారు.

కడెంలో..


నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కడెం: మాసాయిపేట్‌లో నాయకులు

కడెం: మండలంలోని మాసాయిపేట్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, వెంకటేశ్, గంగన్న, భూషణ్, రాజు, రమేశ్ తదితరులున్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న అధికారులు

కుభీర్: గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి మనోహర్ అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేస్తున్న పనులను పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలల పున:ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలన్నారు. తాగునీటి పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడితే మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో చంద్రకాంత్, పంచాయతీరాజ్ డీఈ సురేశ్, ఎంపీవో గోవర్దన్, భగీరథ ఏఈ రాజన్న తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి


విద్యార్థులను అభినందిస్తున్న మోహన్‌రావు

భైంసాటౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ప్రజా ట్రస్ట్ చైర్మన్ బి.మోహన్‌రావు పటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను మోహన్‌రావు పటేల్ ప్రజాట్రస్ట్ ఆధ్వర్యంలో అభినందించి సన్మానించారు. ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎత్తుకెళ్లిన సామగ్రి తెచ్చిపెట్టారు

- ఖానాపూర్ మండలం ఎర్వచింతల్‌లో ఘటన


పంచాయతీ కార్యాలయంలోని గదిలో గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన సామగ్రి

ఖానాపూర్: గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సొమ్మును తిరిగి తీసుకొచ్చిన ఘటన మండలంలోని ఎర్వచింతల్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎర్వచింతల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సామగ్రి చోరీ జరిగిన విషయమై పంచాయతీ కార్యదర్శి హన్మంతు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఫిర్యాదు చేసిన విషయం గ్రామంలో తెలియడంతో ఎత్తుకెళ్లిన సామగ్రిని సోమవారం రాత్రి పంచాయతీ కార్యాలయంలో చేర్చిన విషయం వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఉదయం విధులు నిర్వర్తించేందుకు కార్యాలయానికి వచ్చిన పంచాయతీ సిబ్బంది చూడగా రాత్రే గుర్తు తెలియని వ్యక్తులు సామగ్రి తెచ్చి పెట్టినట్లు గుర్తించారు. తెచ్చిన వాటిలో డంబెల్స్, సోలార్ లైట్లు, క్రికెట్ కిట్, నెట్, టీషర్ట్‌లు, తదితర సామగ్రి ఉన్నాయి. మిగతా వస్తువులను సైతం కార్యాలయానికి తీసుకురావాలని సిబ్బంది కోరారు.

ఆయిల్‌పాం సాగు పరిశీలన

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేట, దస్తురాబాద్, బుట్టాపూర్, గొడిసీర్యాల గ్రామాల్లోని ఆయిల్‌పాం తోటలను మంగళవారం హార్టికల్చర్ అధికారిణి సంధ్య పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. పంటను కొమ్ము పురుగు ఆశిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని.. సాగుకు ఆసక్తి కలిగిన రైతులు అధికారులను సంప్రదించాలని సూచించారు. ఫ్రియూనిక్ మండల క్లస్టర్ ఆఫీసర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు అమర్చుకోవాలి


ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలిస్తున్న ఏడీఈ చక్రవర్తి

దస్తురాబాద్: రైతులు తప్పనిసరిగా విద్యుత్ మోటార్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని క్వాలిటీ కంట్రోల్ ఏడీఈ కల్యాణ్ చక్రవర్తి అన్నారు. మంగళవారం మండలంలోని గొడిసీర్యాల, రాంపూర్, మున్యాల, రేవోజీపేట, చెన్నూర్ గ్రామాల్లో చేపట్టిన విద్యుత్ లైన్ పనులను పరిశీలించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్, చరణ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు నిబంధనలు అతిక్రమించొద్దు

భైంసాటౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స అందించే ఆర్‌ఎంపీ, పీఎంపీలు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించవద్దని ఆ సంఘం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి అమ్ముల సాగర్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన మండల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని.. వైద్యం చేస్తే సంఘం తరఫున అధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఆ సంఘం మండలాధ్యక్షులు కదం అర్జున్, ఉపాధ్యక్షుడు సునీల్, కార్యదర్శి సాయికుమార్, తుకారం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు


సత్తనపల్లిలో ఇంటింటి జోగులో భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయ 9వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. చండీ ఉపాసకులు నిమ్మగడ్డ శరత్‌చంద్ర శర్మ, పండితులు వెంకటేశ్‌శర్మ, నితీశ్, విజయ్ ఆధ్వర్యంలో మూలవిరాట్టులకు పంచామృతాభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవచనం, శ్రీలలిత సహస్రనామ పూర్వక కుంకుమార్చన, అగ్నిప్రతిష్ఠ, స్థాపిత దేవతాహోమాలు, లక్ష్మిగణపతి, సుబ్రహ్మణ్య సుదర్శన చండీ, పూర్ణాహుతి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీలలితాదేవి సహిత అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న, గౌరవాధ్యక్షుడు కొత్తపెల్లి సురేశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంటింటి జోగు

ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లిలో పెద్దమ్మతల్లి ఆలయ నాలుగో వార్షిక ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఇంటింటా జోగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బైండ్లోళ్ల డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ముదిరాజ్ సంఘ సభ్యులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. విద్యుత్ తీగలు సరిచేయరూ..



లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ నుంచి వాస్తాపూర్ వెళ్లే మార్గంలో రోడ్డుపై విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గంలో వడ్లు, మక్కల బస్తాలతో వెళ్లే లారీలతోపాటు, ఇతర భారీ వాహనాలకు తీగలు తగులుతున్నాయి. లారీ క్లీనర్లు దిగి విద్యుత్ తీగలను పైకి లేపుతున్నారు. ప్రమాదం జరగకముందే విద్యుత్ తీగలను సరిచేయాలని వాహనాదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శివకుమార్, ఏఈ, లోకేశ్వరం, ఫోన్: 94408 11710

బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ ఆందోళన


ఆందోళన చేస్తున్న నాయకులు

దిలావర్‌పూర్: సన్నరకాలతోపాటు దొడ్డురకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మంగళవారం దిలావర్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ నాయకులు రాంకిషన్‌రెడ్డి, డాక్టర్ సుభాశ్‌రావు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని.. బోనస్ చెల్లించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.